# సుజాత పెళ్ళి

"మీరలా వెళ్ళగానే చలమయ్య అనే అతను వచ్చాడు" అంది వందన.

ఏ చలమయ్య అనే విషయం గుర్తుచేసుకోవలసిన అవసరం నాకు లేదు. చలమయ్య నా బాల్య స్నేహితుడు. పదవ తరగతి వరకు కలసి చదివాము.

" ఏడి? బాత్‌రూంలో వున్నాడా?" అన్నాను ఆత్రుతగా. వాడిని చూసి ఇరవై సంవత్సరాలు పైనే అయింది.

"బాగుంది, ముక్కూ మొహం తెలియనివాణ్ణి బాత్‌రూంలోకి దూరనిస్తానా? మీరు ఇంట్లోలేరు మరో గంటకు కాని రారని చెప్పాను. అదిగో ఆ సంచి ఆ మూల పెట్టి మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు" అంది వందన.

చెప్పులు పెట్టేచోట సంచీ చూసి వందనకు మరీ మతిలేదు అనుకున్నాను. కనీసం హాలులో పెట్టమనలేకపోయావా? అని సంచీ తీశాను. నాలుగైదు మామిడి పళ్ళు ఉన్నాయి. నాకు మామిడి పళ్ళంటే ఇష్టమని తెచ్చి ఉంటాడు. వాడికేం తెలుసు ఇప్పుడు మామిడిపళ్ళు నేను తినలేనని?

మేం ఎలాంటి స్నేహితులమో వందనకేం తెలుసు. మా పెళ్ళి సమయానికి వాడు ఎం.ఎస్‌సి. అగ్రికల్చర్ చదవడానికి బనారస్ వెళ్ళిపోయాడు. వాడి పెళ్ళి ముందే జరిగిపోయింది.

"పోనీ, కాఫీ అయినా ఇచ్చావా?" అన్నాను.

"మళ్ళీ అదే ప్రశ్న! అతనెవరో నాకు తెలియదు. ఇంకా నయం వీధి గుమ్మంలోంచే పంపేయలేదు. ఇంతకీ ఎవరా పురుషోత్తముడు, మీరు అంతగా తపించుకుపోతున్నారు?" అంది.

వందన ప్రవర్తనను తప్పుపట్టలేను. మగవాళ్ళు లేని సమయంలో ఏదో సాకుతో ఇంట్లో ప్రవేశించి, కత్తి చూపి బెదిరించి వున్నవి వూడ్చుకుపోయే దొంగలగురించి వార్తాపత్రికల్లో వార్తలొస్తూనే వున్నాయి.

'రాక రాక వచ్చాడు. వాడికీ వూరు కొత్త. ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో?' స్వగతంగా అనుకున్నా వందనకు ఆ మాటలు వినిపించే వుంటాయి.

"అతను మీ స్నేహితుడా? ఏమో, నాకు నమ్మకం లేదు. ఆ వేష భాషలు చూసి

ఎవడో అడుక్కునేవాడు అనుకున్నాను. మాసిపోయిన తెల్ల పంచె అదేరంగు చొక్కా, కాళ్ళకు స్లిప్పర్లు. మీతో పని వుండి వచ్చానన్నాడు. మీకిలాంటి స్నేహితులు వుంటారని నాకు తెలియదు" అంది వందన.

నేను చేస్తున్న ఉద్యోగంరీత్యా నా స్నేహితులు డాబుగా, దర్పంగా వుంటారు. చలమయ్య ఆ కోవకు చెందినవాడు కాదు. పల్లెటూరి మట్టిమీద పుట్టాడు. అగ్రికల్చర్‌లో ఎం.ఎస్.సి. చేసిన వాడికి కావాలనుకుంటే పెద్ద ఉద్యోగమే దొరికి వుండేది. 'నేను ఈ చదువు చదువుతున్నది ఉద్యోగం చేయాలన్న కోరికతో కాదు. మాకు కాస్త పొలం పుట్రా వున్నాయి. మా తాతముత్తాతలు వ్యవసాయంమీద ఆధారపడినవారే. మా నాన్నలా నేనూ వ్యవసాయమే చేయాలనుకుంటున్నాను. ఈ చదువైతే వ్యవసాయాభివృద్ధికి దోహదంచేస్తుంది. మా గ్రామమూ బాగుపడుతుంది" అన్నాడు.

చలమయ్యకు మంచి ఆతిథ్యం ఇవ్వాలి.

"వందనా! రెండు కూరలు, గారెలు, పరమాన్నం చెయ్యి. మా అమ్మచేసిన పరమాన్నం తిని వాడు చిన్నతనంలో లొట్టలేసుకునేవాడు" అన్నాను.

"బాగుందండి. ఇప్పటికిప్పుడు పురమాయిస్తే అవుతాయా? నెలాఖరుగదా, సరుకులు బొత్తిగా నిండుకున్నాయి" అంది విచారంగా.

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న సామెత మాకు వర్తిస్తుంది. జీతం ఎంత దొరికినా నెల చివర్లో పచ్చడి మెతుకులే గతి. కిరాణాకొట్లో ఖాతా వుందని ఏవి కావలిస్తే అవి, ఎప్పుడు కావలిస్తే అప్పుడు తెచ్చుకుంటే దాని ప్రభావం మళ్ళీనెలలో ఉంటుంది.

"చలమయ్య అందరిలాంటి వాడు కాదు. ఒకమారేంజరిగిందనుకున్నావు?" అన్నాను.

"మీరెప్పుడైనా మీ చలమయ్య విషయాలు చెప్పేరా?"

"అప్పుడు మేం ఆరవతరగతి చదువుతున్నాం. రెండు కిలోమీటర్ల దూరంలో మా స్కూలు వుంది. నడిచే వెళ్ళేవాళ్ళం. మామిడికాయలు సీజను. మేం వచ్చేదారిలో ఒకతోట వుంది. నాకు పలకబారిన కాయ తినాలనిపించింది. చలమయ్య వారించేడు. దొంగతనం కూడదన్నాడు. తోటకాపరి చూస్తే తన్నులు తప్పవన్నాడు. నేను వాడి మాటలను లక్ష్యపెట్టలేదు. నాతోపాటే వాడూ తోటలోనికి వచ్చాడు. నేను చెట్టెక్కి రెండు కాయలు కోసానో లేదో తోటకాపరి పరుగున వచ్చాడు. చలమయ్యకు పారిపోయే అవకాశం వున్నా శిలాప్రతిమలా నిల్చుండిపోయాడు. నేను భయపడుతూనే చెట్టుదిగేను. కొట్టవద్దని బ్రతిమాలేను. వాడు నన్ను కొడతాడన్న భయంకన్నా ఈ విషయం మా నాన్నగారికి తెలిస్తే నా తోలు వలిచేస్తారన్న భయం. అప్పటికే వాడు నన్ను చెట్టుకి కట్టేశాడు. 'అయ్యా! ఇది వాడి తప్పు కాదు. నేనే వాడిని చెట్టెక్కించినాను. నన్ను కొట్టండి, చంపేయండి. మాధవరావుగారి అబ్బాయి వాసుని వదిలేయండి' అంటూ చలమయ్య

తోట కాపరి కాళ్ళమీద పడ్డాడు. తోటవాడు ఏమాలోచించాడో నన్ను వదిలేశాడు. మిత్రుడంటే అలా ఉండాలి" అన్నాను.

"బాగుంది. ఇన్నాళ్ళకు మీరు గుర్తుకొచ్చారా? ఊరకరారు మహాత్ములంటారు. ఏదో పని వుండి వుంటుంది? తినబోతూ రుచెందుకు?" అంది.

"వంట ప్రయత్నం మొదలెట్టు. కూరలున్నాయా, తేవాలా?" అని అడిగాను.

"తప్పుతుందా? నాకు తెలియకడుగుతాను? మీరు చెప్పిన వాటిలో దేన్నైనా మీరు తినగలరా? నూనె వస్తువులు పనికిరావు, తీపి అసలు తినకూడదు. కారం వర్జితం. మీరు చప్పిడితిండి తింటే మీ స్నేహితుడేం తినగలడు?" అంది వందన.

"అమ్మో! డాక్టరు నన్ను తినవద్దన్నాడు. అందుకని చుట్టాలకు పక్కాలకు పచ్చడి మెతుకులు పెడతామా? వందనా నువ్వేమైనా అను, అవతలివాడు తృప్తిగా తింటే నాకు తిన్నంత తృప్తిగా ఉంటుంది."

"గారెలంటే కుదరవు. అరటికాయ బజ్జీలుచేస్తాను. గోంగూర పచ్చడి ఉంది. లేకపోతే కొబ్బరి పచ్చడి చేయమంటారా?"

చలమయ్య కొబ్బరి పచ్చడంటేనే ఇష్టపడేవాడు. వందన కూరలు, కొబ్బరికాయ తెమ్మంది.

సమయానికి మా అమ్మాయి సుజాత ఊర్లోలేదు. కాలేజికి సెలవులని వాళ్ళ మామయ్య గారింటికి వెళ్ళింది. వందన ఆరోగ్యమూ అంతంత మాత్రమే. అయినా ఆమె ఏనాడు ఎవరొచ్చినా వండిపెట్టడానికి వెనుకాడదు.

◆ ◆ ◆

"వీడింకా రాలేదేం?"

"బాగుందండి! రాకుండా వెళ్ళిపోతాడా, సంచీకూడా ఉంచి వెళ్ళేడు" అంది వందన.

"నేను మామిడిపళ్లు తినని వాడికి తెలియదు. నాతోపాటు నువ్వూ తినడం మానేసేవు. పిల్ల కూడా లేదు. వాడు ఆప్యాయంగా తెచ్చిన పళ్లు కుళ్లిపోవలసిందేనా?"

"అయ్యో రామ! మీకన్నీ సమస్యలే. అతను మనకోసమే తెచ్చాడో, వస్తూ దారిలో కొనుక్కున్నాడో?"

"ఉహూఁ! చలమయ్య వట్టి చేతులతో రాడు. అవి మనకోసమే. పోనీ ఒక పనిచేద్దాం. సాయంత్రం సాంబశివరావుగార్ని తీసుకొస్తాను. అతనికి మా వూరి పళ్ళు రుచిచూపిస్తాను" అన్నాను.

"చలమయ్య చలమయ్య అంటున్నారు. అతని కెందరు పిల్లలో తెలుసా?" అడిగింది వందన.

"ఏదీ చాలా రోజులై ఉత్తరాలూ లేవు. వాడికో కొడుకుండాలి. ఇరవై మూడేళ్ళుంటా యనుకుంటాను."

"అమ్మయ్య అదేనా గుర్తుంది. అంటే వాడు మన సుజాతకు ఈడౌతాడు. ఏం చదివేడో, ఏంచేస్తున్నాడో అడగండి. అసలు ఆడపిల్లకు పెళ్ళి చేయాలన్న ధ్యాసే మీకు బొత్తిగా లేదు. అన్నీ సరిపోతే మన అమ్మాయినిస్తాం అని చెప్పండి. జ్ఞాపకం ఉంటుందా?" అంది వందన.

సుజాత పెళ్ళి విషయం నేను పట్టించుకోవటం లేదని వందన అన్నది అభియోగమే. కాళ్ళరిగిపోయేలా తిరుగుతున్నాను. మంచివనుకున్న సంబంధాలు కట్నం దగ్గర తుస్సుమంటున్నాయి. చలమయ్య వాళ్ళది సాంప్రదాయమైన కుటుంబం. పిల్లడు చదువుకొని ఉద్యోగం చేస్తూ వుంటే వందన అన్నట్లు మాట్లాడాలి. చలమయ్య అంగీకరిస్తాడన్న నమ్మకం నాకుంది.

"వింటున్నారా? పెళ్లిమాట ఎత్తితే వాడేం అనుకుంటాడోనని మీరు మొహమాటపడకండి. అలాగైతే ఈ జన్మలో మీరు పిల్లకు పెళ్ళి చేయలేరు" అంది వందన.

మా భోజనాల వేళ కూడా దాటిపోయింది. చలమయ్యరాలేదు. "ఇంకా ఎంతసేపు అతనికోసం కాచుకొని కూర్చుంటారు? మీరు ఎంగిలి పడండి. మందులు వేసుకోవాలి" అంది.

"....."

"తీరా వచ్చి నేను హోటల్లో భోజనం చేసేను అంటే ఈ వండినవన్నీ ఏంచెయ్యాలి?" అంది వందన.

నాకు అనుమానంగానే వుంది. వాడెప్పుడొస్తాడో? వాడు రాకుండా ఎలా తినగలను? తల భారంగా వుంటే మంచమీద వాలేను.

మరో అరగంట తరువాత తలుపు తట్టిన శబ్దం అయింది. పనిపిల్ల కూడా వచ్చేవేళ అది. నాకంటే ముందే వెళ్ళి వందన తలుపులు తీసింది.

"రండి, రండి. మరీ ఆలస్యం చేసేరే!" అంది.

బ్రతుకుజీవుడా అనుకున్నాను.

"వాసుదేవరావుగారు వచ్చారా?" అడిగాడతను.

"వచ్చారు. మీకోసంఎదురుచూస్తున్నారు. భోజనం అయినా చేయకుండా" అంది వందన.

"వారినొక్కమారు ఇటు రమ్మంటారా? మాట్లాడి వెళ్ళిపోతాను. నా రైలుకి వేళ కూడా అయింది."

నాకు చెప్పలేనంత కోపం వచ్చింది. చెప్పులైనా విప్పకుండా వచ్చినవాడు వచ్చినట్లే వెళ్ళిపోతానంటే రావడమెందుకు?

బయటకు వచ్చాను.

"నమస్కారం అండి" అన్నాడు.

నేను కొయ్యబారిపోయాను. నా కోపం ఒక్కమారు చల్లారిపోయింది. నా సంతోషమూ చల్లారిపోయింది. ఎవరతను? వాడు నా చలమయ్య కాదు.

ఒకే పేరు ఒకరికన్నా ఎక్కువమందికి వుండవచ్చును. వందన చలమయ్య వచ్చేడంటే నా బాల్య స్నేహితుడని ఊహించాను.

"మీరలా నిలబడిపోయారేం? నేనెంత బ్రతిమాలినా అతను లోనికి రావడంలేదు" అంది వందన.

"మీరెవరు? ఏం పనిమీద వచ్చారు?" అన్నాను.

ఆశ్చర్యపడడం వందన వంతైంది.

"నన్ను చలమయ్య అంటారు. చిన్న పని వుండి వచ్చాను" అన్నాడతను.

"ఇతను మీకు తెలియదా? మీ స్నేహితుడు కాదా?" అడిగింది వందన. "పోనీలెండి, ఎవరైతేనేం మనింటికి వచ్చారు. అతనికోసం మనం భోజనం సిద్ధం చేశాం. లోపలికి రమ్మనండి" అంది వందన ఇంట్లోకి వెళ్తూ.

వందన చెప్పింది రైటే. అతను తినకపోతే ఆ వండినవి పెంటమీద పారేయాలి.

"మీరెందుకొచ్చారో తర్వాత వింటాను. ముందు మీరు కాళ్ళు చేతులూ కడుక్కొని రండి. భోజనాలవేళ వచ్చినవాడు సాక్షాత్తు నారాయణుడే అంటారు. అతను ఉక్కిరిబిక్కిరయ్యాడు. చివరకు మా మాట నెగ్గింది.

"అమ్మా! మీరు అన్నపూర్ణలాంటివారు. నేను నా పనిమీద వచ్చినా మీరు ప్రేమతో పంచభక్ష్యపరమాన్నాలు పెట్టేరు. ఈ రోజును నేను జీవితంలో మరువలేను. నేను ఏమిస్తే మీ రుణం తీరుతుంది? మా తోటలో కాచిన మామిడిపళ్ళు తెచ్చాను, ఇదండి" అన్నాడు సంచీలోంచి పళ్ళుతీసి వందనకిస్తూ.

"చలమయ్యగారు! ఇప్పుడు చెప్పండి మీరొచ్చిన పనేమిటో" అన్నాను.

"బాబుగారు, నేను పేదవాడిని. నా రక్తం ధారపోసి కొడుకుని చదివించాను. ఈ మధ్యనే

వాడు మీ డిపార్టుమెంటులో ఇంటర్వ్యూ ఇచ్చాడు. మీరు కనికరిస్తే మా వాడికా ఉద్యోగం దొరుకుతుంది" అన్నాడు చలమయ్య.

"జూనియర్ ఇంజనీరు పోస్టా?" అన్నాను.

ఔనన్నట్లు తలవూపాడు.

"అయ్యో మెరిట్‌లిస్టు తయారై పైకి వెళ్ళిపోయింది" అన్నాను.

"అయ్యో! మా వాడంటూనే వున్నాడు. 'ఆలస్యం అమృతం విషం' అని. నేను అశ్రద్ధ చేశాను. 'ఒట్టిచేతుల్తో ఎలా వెళ్ళనురా. ఈ రోజే మామిడికాయ దింపించేను. నాలుగురోజులు కాగులో వుంటే పండుతాయి. అవి తీసుకొని వెళ్తాను' అని ఆలస్యంచేశాను. వాడంటూనే వున్నాడు మన చెట్టువే ఇవ్వాలా, సంతలో కొని పట్టుకెళ్లు అన్నాడు వాడు."

"ఇంతకీ మీ అబ్బాయి పేరు?" ఆ ప్రశ్నకు అర్థం లేదని నాకు తెలుసు. అతనొక చీటీ ఇచ్చాడు.

"చలమయ్యగారు మీరు అదృష్టవంతులు మెరిట్ లిస్టులో మీ అబ్బాయి పేరుంది" అన్నాను సంతోషంగా.

వందన కళ్ళు మిలమిల మెరిసాయి.

పాతికేళ్ళకు పైగా నాతో కలసి కాపురంచేస్తున్నది ఆమె మనసులో ఏమి ఊహించుకుంటున్నదో నాకు తెలియదా? గోపాలరావు ఫోటో చూశాను. క్వాలిఫికేషన్స్ చూశాను. వందన అభిప్రాయమూ పసిగట్టాను.

◆ ◆ ◆

"ఆలస్యం అమృతం, విషం అంటారు. మీరు వెంటనే ఆ చలమయ్యతో మన సుజాతనిస్తాం అని చెప్పండి" అంది. నాకూ ఆ ఉద్దేశం వుంది.

వెతకబోయిన తీగ కాలికి తగలడమంటే ఇదే కాబోలు.

-పత్రిక-మాసపత్రిక - జనవరి **2006**